

గంగమ్మా.. చల్లంగ చూడమ్మా..

సునామీ వచ్చి మంగళవారం నాటికి 19 ఏళ్లు కావడంతో పెదజాలరిపేటలో గంగపుత్రులు ప్రత్యేక పూజలు జరిపారు. 8లో



ఎంవోయూ రద్దు చేయాలి

జిందాల్‌తో స్టీల్‌ప్లాంట్ చేసుకున్న ఎంవోయూ రద్దు చేయాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 8లో



మరికొంత కాలం రైళ్ల రద్దు

విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు మరికొంత కాలం రద్దు చేశారు. 8లో

న్యూస్‌రీల్

నిశితంగా పరిశీలించి అనుమతులివ్వండి



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జిల్లాలో 14 అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టీ), సరోగసీ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన ఏఆర్‌టీ, సరోగసీ జిల్లా కమిటీ, జిల్లా మెడికల్ బోర్డు సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ఈ కేంద్రాలను నిశితంగా పరిశీలించి అనుమతులివ్వాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావును ఆదేశించారు. సమావేశంలో కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి, పిల్లల విభాగ వైద్యుడు డాక్టర్ చక్రవర్తి, ఎన్‌జీవో ఎల్.వి.రమణి, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, నాగభూషణం పాల్గొన్నారు.

వ్యర్థాలను బయట పారవేయవద్దు

జీవీఎంసీ కమిషనర్ విజ్ఞప్తి



డాబాగార్డెన్స్: పారిశుధ్య కార్మికులు మంగళవారం నుంచి సమ్మెలో పాల్గొంటున్నందున.. పారిశుధ్య నిర్వహణలో కలుగుతున్న అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కమిషనర్ సాయికాంత్‌వర్మ కోరారు. మీ ఇంటి వద్దకు వచ్చే క్లాప్ వాహనాలకు వేరు చేసిన వ్యర్థాలు అందించాలని లేదా సమీపంలోని డస్ట్‌బిన్లలో వేయాలని సూచించారు. వ్యర్థాలను బయట పారవేయకుండా జీవీఎంసీ ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లలో మాత్రమే వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అప్పన్నను దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ సుధీర్ కుమార్ జైన్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద న్యాయమూర్తికి అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.

క్రైం డీసీపీగా వెంకటరత్నం బాధ్యతల స్వీకరణ



సీపీని మర్యాద పూర్వకంగా కలిసిన క్రైం డీసీపీ వెంకటరత్నం

అల్లిపురం: నగర క్రైం డీసీపీగా పి.వెంకటరత్నం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో క్రైం ఏడీసీపీగా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు.

మరో ఇద్దరికి కరోనా

మహారాణిపేట: విశాఖలో మంగళవారం మరో ఇద్దరికి కరోనా సోకింది. దీంతో జిల్లాలో కరోనా కేసుల సంఖ్య 11కి చేరుకుంది. ఇద్దరి నుంచి సేకరించిన నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జి.జగదీశ్వరరావు తెలిపారు. గడిచిన 24 గంటల్లో 34 మందికి పరీక్షలు చేయగా.. ఇద్దరికి కరోనా నిర్ధారణ అయినట్లు చెప్పారు. వివిధ అనారోగ్య సమస్యలతో చనిపోయిన మహిళ భర్తతో పాటు 15 మంది కుటుంబ సభ్యులకు పరీక్షలు చేయగా.. అందరికీ నెగిటివ్ వచ్చిందన్నారు. కేజీహెచ్ రాజేంద్రప్రసాద్ వార్డులో చికిత్స పొందుతున్న వ్యక్తికి పాజిటివ్ రావడంతో ఐసోలేషన్ వార్డుకు తరలించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ జి.అశోక్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో ఇద్దరు రోగులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు.



ఆట ఆరంభం

అట్టహాసంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు



చంద్రంపాలెం హైస్కూల్లో పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



కిట్టూతో విద్యార్థుల కరచాలనం

విశాఖ సిటీ: దేశంలోనే ఒక మైలురాయిగా నిలిచే క్రీడా సంబరం.. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం జిల్లాలో అట్టహాసంగా ప్రారంభమైంది. మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తీసుకొచ్చే ఉద్దేశంతో చేపట్టిన ఈ పోటీల్లో ఆటగాళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో నిర్వహించే ఈ పోటీలను ప్రతి నియోజకవర్గంలోను స్థానిక ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్తలు మంగళవారం ప్రారంభించారు. ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు 47 రోజుల పాటు గ్రామ/వార్డు సచివాలయం, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. క్రీడల ద్వారా గ్రామ స్థాయి నుంచి ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పోటీపడేలా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో దేశంలోనే తొలిసారిగా ఇంతటి భారీ క్రీడా పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

పండగలా ప్రారంభ కార్యక్రమం

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని మంగళవారం జిల్లాలో పండగలా నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలోను స్థానికంగా ఉన్న పాఠశాలలు, క్రీడా మైదానాల్లో ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాలో 1,34,399 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం మధురవాడ చంద్రంపాలెం పాఠశాలలో జరగ్గా తూర్పు నియోజకవర్గంలో విశాఖ ఎంపీ, తూర్పు సమన్వయకర్త ఎం.వి.వి.సత్యనారాయణ ఏయూ మైదానంలోను, దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో, విశాఖ ఉత్తర నియోజకవర్గంలో సమన్వయకర్త కె.కె.రాజు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి పోర్టు డీఎల్‌బీ గ్రౌండ్‌లోను, పెందుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సబ్బవరం, పరవాడ, పెందుర్తి ప్రాంతాల్లోను, పశ్చిమ నియోజకవర్గంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఈ క్రీడా పోటీలకు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు.



ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో పోటీలను ప్రారంభిస్తూ బ్యాటింగ్ చేస్తున్న ఎంపీ ఎంవీవీ



కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో టాస్ వేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కేకే రాజు

చాలా మంచి కార్యక్రమం



మాది మారికవలస. బీఎస్సీ పూర్తి చేశాను. ఆడుదాం ఆంధ్రా చాలా మంచి కార్యక్రమం. బయట నిర్వహించే ఆటల పోటీలు కంటే భిన్నంగా ఉన్నాయి. యువతను సక్రమమైన మార్గంలో నడిపించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

– దువ్వి సత్యనారాయణ, క్రికెట్ క్రీడాకారుడు, మారికవలస

మాణిక్యాలు వెలుగులోకి వస్తారు



మాది బోరవానిపాలెం. డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ పోటీలకు వచ్చాను. ప్రభుత్వం అన్ని వయస్సుల వారికి ఈ విధంగా ఆటల పోటీలు నిర్వహించడం చాలా మంచి పరిణామం. ఇటువంటి పోటీల వల్ల మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తారు.

– శీల వెంకటేష్, కబడ్డీ క్రీడాకారుడు

సీఎం జగన్ చేతల్లో చూపించారు



మాది కళానగర్. ఈ ఫార్మసీ చదువుతున్నాను. మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తానని చెప్పడమే కాదు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతల్లో చూపించారు. ఆటల పోటీల్లో మహిళలకు అవకాశం ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

– పిళ్లా స్మృతి, వాలీబాల్ క్రీడాకారిణి

ఆణిముత్యాల కోసం ఆడుదాం ఆంధ్రా



చంద్రంపాలెం హైస్కూల్లో క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు

- విశాఖలోనే రాష్ట్ర పోటీలు
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి
- అంతర్జాతీయ స్థాయిలో మన క్రీడాకారులు రాణించాలి: ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి పోటీలు ఫిబ్రవరి 10 తర్వాత విశాఖలోనే జరుగుతాయని కలెక్టర్ డాక్టర్. మల్లికార్జున చెప్పారు. ఇటువంటి తలమానికమైన కార్యక్రమం నిర్వహించడానికి అంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మంగళవారం మధురవాడ చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సచివాలయ స్థాయి ఆడుదాం ఆంధ్ర విశాఖ జిల్లా పోటీలను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తదితరులతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీలకు విశాఖ జిల్లా నుంచి 1,34,398 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా ఇందులో పురుషులు 78,485 మంది, మహిళలు 55,913 మంది ఉన్నారన్నారు. ఎవరూ ఎప్పుడు ఊహించని విధంగా లక్షలాది మందిని ఒక కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం.. క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం గొప్ప విషయమన్నారు. జనవరి 1నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. **ఎమ్మెల్యే ముత్తంశెట్టి** శ్రీనివాసరావు మాట్లాడుతూ **జాతీయ, అంతర్జా**తీయ వేదికలపై మన క్రీడాకారులు రాణించే విధంగా ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర పోటీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టాలని చెప్పారు. గ్రామీణ, పట్టణాల్లో మట్టిలో మాణిక్యాలను వెలికితీసి అన్ని స్థాయిల్లో పోటీ పడే విధంగా తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మన క్రీడాకారులు అంతటా రాణించి మన ప్రాంతానికి గౌరవం తీసుకురావాలన్నారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనం, క్రీడల పట్ల ప్రోత్సాహం అందించేందుకు ఇటువంటివి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. రాష్ట్ర, జిల్లా అంబాసిడర్స్ సాయి సంహిత, మాణిక్యాలరావులు క్రీడా జ్యోతిని వెలిగించారు. అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఏపీ నగరాల కార్పొరేషన్ చైర్మన్ పిళ్లా సుజాత, డీఎస్‌డీవో జూన్ గ్యాలియేట్, డీఎల్‌డీవో పూర్ణిమాదేవి, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వార్డు ఇన్‌చార్జ్‌లు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, గాదె రోశిరెడ్డి, జెడ్పీ కనక మహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ సేవలు భేష్

- కేంద్ర పాడి పరిశ్రమల శాఖ మంత్రి పర్షోత్తమ్ రుపాలా
- విశాఖ డెయిరీ ట్రస్ట్ ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగానికి శంకుస్థాపన
- తులసీరావుకి పద్మశ్రీ ఇవ్వాలి: డిప్యూటీ సీఎం బూడి



విశాఖ డెయిరీలో యంత్రాలను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి పర్షోత్తమ్ రూపాలా

సాక్షి, విశాఖపట్నం: పాడి రైతులకు వినూత్న సేవలందిస్తూ.. పాల ఉత్పత్తి రంగంలో విశాఖ డెయిరీ అగ్రగామిగా నిలుస్తోందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా అన్నారు. షీలానగర్‌లోని విశాఖ డెయిరీ ట్రస్ట్ ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగం ఏర్పాటుకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అక్కిరెడ్డిపాలెంలోని విశాఖ డెయిరీలో దివంగత ఆదారి తులసీరావు విగ్రహాన్ని ప్రస్తుత చైర్మన్ ఆదారి ఆనంద్ కుమార్, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు భీశెట్టి సత్యవతి, జీవీఎల్ నరసింహారావు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజుతో కలిసి కేంద్ర మంత్రి ప్రారంభించారు. విశాఖ డెయిరీలో పలు యూనిట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. దేశంలో ఏపీతో పాటు గుజరాత్‌లో డెయిరీ రంగం అభివృద్ధి చెందుతోందన్నారు. విశాఖ డెయిరీ రైతుల అభ్యున్నతి, వారి పిల్లల విద్య కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని కొనియాడారు. విశాఖ డెయిరీని ఆదారి తులసీరావు ఎంతో ఉన్నత స్థానానికి తీసుకువెళ్లారన్నారు. పాడి రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, పశువుల ఆరోగ్యం కోసం మొబైల్ క్లినిక్ లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల రైతుల ఆరాధ్య దైవం ఆదారి తులసీరావు అని కొనియాడారు. తులసీరావుకు పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరారు. తండ్రి బాటలోనే ఆదారి ఆనంద్ కుమార్ ప్రయాణం సాగిస్తున్నారన్నారు. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం విశాఖ డెయిరీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్ల రమాకుమారి, ప్రభుత్వ సలహాదారుడు(స్కిల్ డెవలప్‌మెంట్) గాది శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, విశాఖ డెయిరీ ఎండీ ఎస్.వి.రమణ, కార్పొరేటర్లు, డెయిరీ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆదారి తులసీరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి పర్షోత్తమ్, మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీలు సత్యవతి, జీవీఎల్

30న సబ్‌జూనియర్ అథ్లెటిక్ మీట్

విశాఖ స్పోర్ట్స్: జిల్లా స్థాయి బాలబాలికల అథ్లెటిక్ మీట్ ఈనెల 30న రైల్వే గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నారు. అండర్ 14, 16 బాలబాలికలకు ఆయా ట్రాక్ ఫీల్డ్ అంశాల్లో పోటీలు నిర్వహించి విశాఖ అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా జట్లను ఎంపిక చేయనున్నారు. అండర్ 14 బాల బాలికలకు ట్రయాథ్లాన్ అంశాల్లోను, అండర్ 16 బాలబాలికలకు 60 మీటర్లు, 80 మీటర్ల హార్డిల్స్, 600 మీటర్ల పరుగు, హై జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావెలిన్, పెంటాథ్లాన్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే చిన్నారులు ఈనెల 28లోగా వేదిక వద్దే ప్రవేశ రుసుం చెల్లించాలి. ప్రతీ అథ్లెట్ ఒక్క అంశంలోనే పోటీపడాల్సి ఉంటుంది. ఎంపికైన వారు ఫిబ్రవరి 16 నుంచి అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ అంతర జిల్లాల జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు.

వైద్యారోగ్య శాఖలో 8 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. జోన్-1 పరిధిలో మొత్తం 8 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ సుజాత తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల్లోని ఖాళీలను భర్తీ చేస్తున్నామని.. నెలకు రూ.25 వేలు వేతనంగా అందిస్తామన్నారు. బీఎస్సీ(నర్సింగ్), బీఎస్(నర్సింగ్, సీపీసీహెచ్) చేసిన వారు ఈ పోస్టులకు అర్హులున్నారు. https:// nagendrasvst. wordpress. com లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని.. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 28 నుంచి జనవరి 12వ తేదీలోగా డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలోని రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో అందజేయాలని ఆర్డీ సుజాత కోరారు.

28న స్థాయీ సంఘం బడ్జెట్ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘం బడ్జెట్ సమావేశం ఈ నెల 28న నగర మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నారు. జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశంలో 2023-24 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాలపై చర్చ, 2024-25 ఏడాదికి బడ్జెట్ అంచనాలు రూపొందించనున్నారు. సెక్షన్ 184 ప్రకారం స్థాయీ సంఘం ఆమోదం తెలిపిన అనంతరం సెక్షన్ 185 ప్రకారం వచ్చే నెల 10వ తేదీలోగా కార్పొరేషన్‌కు అందజేయాల్సి ఉంది.

29న స్థాయీ సంఘ సమావేశం

జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నారు. మేయర్ హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో 52 అంశాలు ఆమోదానికి రానున్నాయి.

శతశాతం పరిశీలన పూర్తి!

- ఓటరు జాబితా ముసాయిదాపై అభ్యంతరాల పరిష్కారం
- గత నెల 27 నుంచి ఇప్పటివరకు 2.64 లక్షల అభ్యంతరాలు
- ముగిసిన పరిష్కార గడువు
- గడువు ముగిసే నాటికి 2.62 లక్షల దరఖాస్తులు పరిష్కారం
- సాంకేతిక కారణాలతో అపరిష్కృతంగా 1941 దరఖాస్తులు

మొత్తం అభ్యంతరాలు : **2,64,314**

పరిష్కరించిన అభ్యంతరాలు : **2,62, 373**

అపరిష్కృతంగా మిగిలిన అభ్యంతరాలు : **1941**

నియోజకవర్గాల పరిష్కరించిన అభ్యంతరాల వివరాలివీ...

నియోజకవర్గం	దరఖాస్తులు	పరిష్కరించినవి
భీమిలి	41,218	40,913
విశాఖ తూర్పు	51,442	50,984
విశాఖ దక్షిణం	24,608	24,229
విశాఖ ఉత్తరం	39,488	39,313
విశాఖ పశ్చిమం	42,871	42,686
గాజువాక	40,670	40,473
పెందుర్తి	24,017	23,775
మొత్తం	2,64,314	2,62,373

సాక్షి, విశాఖపట్నం : ఓటరు సవరణ జాబితాలో కీలక క్రతువు ముగిసింది. ఎన్నికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం వడివడిగా అడుగులు వేస్తోంది. సార్వత్రిక సమరానికి కీలకమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు విడుదల చేసిన ముందస్తు ముసాయిదాపై వచ్చిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో శతశాతం పరిష్కరించారు. డోర్ టూ డోర్ సర్వే సమయం నుంచి ఇప్పటివరకు సుమారు 2.64 లక్షల వరకూ అర్జీలు, అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తులు రాగా.. వీటిలో 2.62 లక్షలకు పైగా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిష్కరించారు. మిగిలిన 1,941 దరఖాస్తులు ఎప్పటికీ పరిష్కారం కానివిగా ఉండటంతో తుది జాబితా తయారీపై జిల్లా అధికారులు దృష్టి సారించారు.

సార్వత్రిక ఎన్నికలు-2024 నిర్వహణకు సంబంధించి ఒక్కో ప్రక్రియ పూర్తవుతోంది. పాత ఓటర్ల జాబితా మదింపు తర్వాత విడుదల చేసిన ఓటరు జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై జిల్లా ఎన్నికల యంత్రాంగం స్వీకరించిన అభ్యంతరాల పరిష్కార గడువు ముగిసింది. 43 రోజుల పాటు స్వీకరించిన అభ్యంతరాలు, సలహాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున ఆదేశాలతో వాటన్నింటినీ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి.. పరిష్కరించారు. ఫారం-6, 6ఏకి సంబంధించి 71,705, ఫారం-7కి సంబంధించి 87,796, ఫారం-8కి సంబంధించి 1,04,813 దరఖాస్తులు రాగా.. వాటిని దాదాపు పరిష్కరించారు. వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని బీఎల్‌వోలు ఓటరు వద్దకు వెళ్లి వివరాలు సేకరించి.. వారు సంతృప్తి చెందిన అనంతరం క్లియర్ చేశారు. ఓటర్ల నుంచి వచ్చిన క్లెయిమ్స్‌ని అనుసరించి.. అవసరమైన ఫారంని నింపి.. దాని ప్రకారం.. సదరు ఓటరుకు సంబంధించిన మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే అధికారులు సవరించారు. డబుల్ ఓట్లు, చిరునామాలో లేకపోయినా ఉన్నట్లుగా చూపించిన ఓట్లన్నింటినీ అధికారులు తొలగించారు.

జనవరి 5న తుది ముసాయిదా..



డ్రాఫ్ట్‌కు సంబంధించిన ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ప్రతి ఓటుని అప్‌లోడ్ చేసే పనిలో నిమగ్నమయ్యాం. సాంకేతిక పరమైన పనులన్నీ పూర్తయిన తర్వాత.. 2024 జనవరి 1న ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ, తనిఖీ ప్రక్రియ జరుగుతుంది. అనంతరం ఎన్నికల కమిషన్ జనవరి 5న తుది జాబితాని ప్రకటిస్తుంది. జిల్లా పరిధిలోని ఎన్నికల అధికారులు.. ప్రతి ఒక్క ఓటుని నిశితంగా పరిశీలించి చర్యలు చేపట్టడంతో ప్రతి దరఖాస్తు పరిష్కృతమయ్యేలా చర్యలు చేపట్టాం.

– కె.మోహన్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి



పసుపు నీళ్లు, పాలతో అభిషేకం చేస్తున్న మహిళలు



ఊరేగింపుగా వస్తున్న మత్స్యకార మహిళలు

గంగమ్మా.. చల్లంగ చూడమ్మా



తీరంలో గంగమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

సముద్రుడికి పూజలు చేసిన మత్స్యకారులు

ఎంవీపీకాలనీ: తల్లీ నిన్నే నమ్ముకున్నాం. చల్లంగ చూడమ్మా.. అంటూ గంగపుత్రులు నిండు మనసుతో గంగమ్మ తల్లికి క్షీరాభిషేకం చేశారు. సునామీ వచ్చి మంగళవారం నాటికి 19 ఏళ్లు కావడంతో పెదజాలరిపేటలో గంగపుత్రులు ప్రత్యేక పూజలు జరిపారు. 2004 డిసెంబర్ 26న సునామీ విలయతాండవంతో మత్స్యకారులు తీవ్ర ఆందోళన చెందారు. అలాంటి విపత్తులు పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ మత్స్యకారులు ఏటా గంగమ్మతల్లికి క్షీరాభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తోంది. కాగా.. ఉదయం ప్రారంభమైన ఈ పూజలు మధ్యాహ్నం వరకు కొనసాగాయి. ఈ ఏడాది కేంద్ర మత్స్య శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా, రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత మంత్రులు స్థానిక నాయకులతో కలిసి అమ్మవారి పెద్దంటికి చేరుకుని పూజలు చేశారు. అనంతరం మహిళలు నిర్వహించిన కలశాల ఊరేగింపులో పాల్గొని తీరానికి చేరుకున్నారు. తీరంలోని గంగమ్మ దేవి ఆలయంలో పూజలు నిర్వహించి.. ఆ తల్లీ ఆశీస్సులు మత్స్యకారులపై ఉండాలని ప్రార్థించారు. అనంతరం మహిళలు తీరంలో కొబ్బరి కాయలు కొట్టి, పూజలు నిర్వహించారు. సముద్రుడికి హారతి ఇవ్వడంతో పాటు పసుపు నీరు, పాలతో అభిషేకం చేశారు. ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ పేర్ల విజయచందర్, 19వ వార్డు కార్పొరేటర్ నూకరత్నం, నాయకుడు సూరాడ దాసు, వార్డు అధ్యక్షుడు గణేష్, గ్రామ పెద్ద పరసన్న, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

చేపల ఎగుమతులు పెరగాలి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాలా, చిత్రంలో రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు



సమావేశానికి హాజరైన వివిధ రాష్ట్రాల మత్స్యశాఖ అధికారులు

- కేంద్ర మత్స్యశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా
- మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం : మంత్రి సీదిరి

మహారాణిపేట: చేపల ఎగుమతులను పెంచాలని కేంద్ర మత్స్యకార, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా పిలుపునిచ్చారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) 10వ పాలక మండలి సమావేశం మంగళవారం నగరంలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో జరిగింది. ఈ సమావేశానికి కేంద్రమంత్రి అధ్యక్షత వహించగా.. ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల మత్స్యశాఖ మంత్రులు డాక్టర్ సీదిరి అప్పలరాజు, మంకల్ ఎస్ వైద్య, త్రిపుర, ఉత్తరాఖండ్, పంజాబ్ రాష్ట్రాల మత్స్యశాఖ అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. కేంద్ర కార్యదర్శి అభిలాక్ష్ లిఖి, సంయుక్త కార్యదర్శి నీతు క్మారీ ప్రసాద్, ఎన్ఎఫ్‌డీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ ఎల్.నరసింహమూర్తి, 13 మంది నామినేట్ చేసిన నాన్-అఫీషియల్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ రొయ్యల ఎగుమతికి పలు రాష్ట్రాలు ఎంతో ప్రాధాన్యమిస్తున్నాయని.. వీటికి మార్కెట్‌లో కూడా అధిక డిమాండ్ ఉందన్నారు. రొయ్యల సాగు మాదిరిగానే చేపల ఉత్పత్తి ఎక్కువగా ఉందన్నారు. చేపలను కూడా అధికంగా ఎగుమతి చేయాలని సూచించారు. డీప్ సీ ఫిషింగ్, సంప్రదాయ ప్రాసెసింగ్ యూనిట్లు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే అవకాశాలను అన్వేషించడానికి ఓ విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత మద్దతుతో మత్స్య పరిశ్రమ అభివృద్ధి, పథకాల ద్వారా మౌలిక సదుపాయాలను ఆయా రాష్ట్రాలు వేగవంతం చేయాలన్నారు. ఎన్ఎఫ్‌డీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ నరసింహమూర్తి స్వాగత ఉపన్యాసం చేశారు. కేంద్ర కార్యదర్శి అభిలాక్ష్‌లిఖి మాట్లాడుతూ మత్స్య కార్మికులకు గుర్తింపు, వ్యాపార నిర్వహణ, మత్స్య వేటలో సాంకేతికతను అమలు చేయడానికి కేంద్రం సహకరిస్తుందని తెలిపారు. రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఫిషింగ్ హార్బర్‌ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని, ఇందుకు కేంద్రం సహకరించాలని కోరారు. మత్స్యకారులకు క్రాఫ్ట్ బీమా అందించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతీ మత్స్యకారుడికి అందేలా ఉండాలన్నారు. మత్స్యకారుల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. డీప్ సీ ఫిషింగ్ ఓడల యూనిట్ ధరలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని సవరించాలని కేంద్రమంత్రిని అభ్యర్థించారు.

జిందాల్‌తో ఎంవోయూ రద్దు చేయాలి

- ఉక్కు కార్మిక సంఘాల ధర్నా
- అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఉద్రిక్తత



ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద బైఠాయించిన కార్మిక నాయకులు



అడ్మిన్ బిల్డింగ్ ముందున్న ఫెన్సింగ్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నాయకులు

ఉక్కునగరం: జిందాల్‌తో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేసుకున్న ఎంవోయూ రద్దు చేయాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిందాల్‌తో ఒప్పందానికి నిరసనగా మంగళవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. కార్మిక నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున బైఠాయించడంతో జనరల్ షిఫ్ట్‌కు వెళ్తున్న ఉద్యోగులు నిలిచిపోయారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ నేతృత్వంలో స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో గాజువాక, స్టీల్‌ప్లాంట్, న్యూపోర్టు, దువ్వాడ, పరవాడ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్మికుల ఆగ్రహం చూసి పోలీస్ శాఖ అడ్మిన్ బిల్డింగ్ ముందు ఫెన్సింగ్ వేశారు. దీంతో కార్మిక నాయకులు పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెన్సింగ్ అంశం ఇరువర్గాల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. నాయకులు ఫెన్సింగ్‌ను బలవంతంగా తొలగిస్తుండగా వారి ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. ఈలోగా ఏసీపీ త్రినాథ్ అక్కడకు చేరుకొని ఫెన్సింగ్ కొంత మేర తొలగించడంతో పాటు ఉక్కు యాజమాన్యం ప్రతినిధులను ఒప్పించి గేటు వద్దకు రప్పించేలా దౌత్యం చేశారు. దీంతో స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ (ఐఆర్) జీఎం కె.సంజీవరావు గేటు వద్దకు వచ్చి జిందాల్ ఈఓఐ ప్రక్రియను వివరించారు. వాటి వివరాలను వెల్లడించి మరిన్ని వివరాలకు సీఎండీ కార్యాలయానికి వచ్చి పత్రాలను చూడవచ్చని తెలిపారు. ఆయన సమాధానంతో సంతృప్తి చెందని కార్మిక నాయకులు ఎంవోయూను ఈనెల 29లోగా ఒప్పందం రద్దు చేయకపోతే 30న ఉక్కు ఉద్యోగులు తమ కుటుంబాలతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న సీఎండీ అతుల్ భట్‌ను రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ జిందాల్ ఒప్పందంలో వెయ్యి కోట్లు కుంభ కోణం ఉందని, తక్షణం దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీరుకొండ రామచంద్రావు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి వ్యతిరేకంగా యాజమాన్యం వ్యవహరిస్తుందన్నారు. వై.మస్తానప్ప మాట్లాడుతూ సీఎండీ వచ్చిన దగ్గర నుంచి హామీలు ఇవ్వడం తప్ప వాటిని అమలు చేయడం లేదన్నారు. అనంతరం ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్.రావు, కారు రమణ, యు.రామస్వామి, వై.టి.దాస్, జె.రామకృష్ణ, బీఎంకె నాయక్, కొమ్ము ప్రసాద్, చీకటి శ్రీనివాస్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

సాక్షి, విశాఖపట్నం : జిల్లాలో ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే కంప్యూటర్ ఆధారిత డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో కె.మోహన్ కుమార్ అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణపై తన చాంబర్‌లో అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం నుంచి జనవరి 3వ తేదీ వరకు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు, జనవరి 4న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్లకు శాఖాపరమైన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 4,719 మంది ఉద్యోగులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు హాల్ టికెట్, ఐడీ ప్రూఫ్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. టాయిలెట్లు, విద్యుత్, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలు పరిశీలన చేసుకోవాలని, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను సూచించారు.

6న జిల్లా వెటరన్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్ : జిల్లా వెటరన్ మెన్, వుమెన్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక జనవరి 6, 7వ తేదీల్లో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరగనుంది. బ్యాడ్మింటన్ సంఘం విశాఖ ఆధ్వర్యంలో ఈ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. మెన్, వుమెన్‌కు సింగిల్స్, డబుల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్ జట్ల ఎంపిక 35+ నుంచి 75+ వయసుల వారికి తొమ్మిది కేటగిరిల్లో ఎంపిక చేయనున్నారు. పోటీల్లో పాల్గొనే వారు జనవరి 4వ తేదీలోగా ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఆయా కేటగిరిల్లో సెమీస్‌కు చేరిన వారిని జిల్లా జట్టుగా ఎంపిక చేసి రాజమండ్రిలో జరగనున్న స్టేట్ వెటరన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌కు అర్హత కల్పించనున్నారు.

31న రెడ్డి కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం

డాబాగార్డెన్స్: వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న రెడ్డి కుటుంబాల ఆత్మీయ సమ్మేళన వన భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి తెలిపారు. ముడసర్లోవ పార్కు వేదికగా నిర్వహించనున్న ఆత్మీయ కలయికలో ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్, తంబోలాతో పాటు ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఉత్తరాంధ్ర రెడ్డి జాతీయులు, సంఘ జీవితకాల సభ్యులు, రెడ్డి కుటుంబాలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. పిక్నిక్ టికెట్లు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని సంక్షేమ సంఘం కార్యాలయంలో లభిస్తాయన్నారు. మరిన్ని వివరాలకు 90306 55681ను సంప్రదించవచ్చు.

మందుబాబులకు రూ.5.12 లక్షల జరిమానా

అల్లిపురం: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నగరంలోని కోర్టు తీర్పు వెల్లడించింది. న్యూపోర్టు, గోపాలపట్నం, పెందుర్తి, మల్కాపురం, మహారాణిపేట, వన్‌టౌన్, టూటౌన్, పీఎంపాలెం, గాజువాక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 121 మంది పట్టుబడ్డారు. వీరికి కోర్టు రూ.5,12,000 జరిమానా విధించింది. టూటౌన్ స్టేషన్ పరిధిలో ఒకరికి 14 రోజులు రిమాండ్ విధించింది. వాహనాలు నడిపే సమయంలో మద్యం మత్తుకు దూరంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ కోరారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో ఓ బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. వివరాలివీ.. చిన్నవాల్తేరు పరిధి రెల్లివీధికి చెందిన బాలుడు సీతంపేటలో ఉంటున్న బాలికను ప్రేమించాడు. మాయమాటలు చెప్పి కొద్ది రోజు కిందట బాలికను ఆమె ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. బాలిక కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి ఇద్దరూ నిడదవోలులో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి నుంచి వారిని నగరానికి తీసుకొచ్చారు. విచారణలో బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తేలడంతో బాలుడిపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు.

రూ.12 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం



ప్రభుత్వ భూమిలో వేసిన ఫెన్సింగ్ పోల్స్‌ను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న సిబ్బంది



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఆనందపురం : మండలంలోని కుసులువాడలో ఆక్రమణల పాలైన కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వం భూమిని మంగళవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దారు ఎల్.రామారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుసులువాడ సర్వే నంబరు 140లోని సుమారు నాలుగు ఎకరాల మిగులు భూమి (సీలింగ్) ఉంది. గతంలో ఇద్దరు పేదలకు ఆ భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఆ భూమిని విశాఖకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అక్రమంగా కొనుగోలు చేసి ప్లాట్లుగా విభజించాడు. విశాలమైన రహదారులు ఏర్పాటు చేసి ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అక్కడ గతంలో నిర్మాణాలు జరపడానికి కొంతమంది పునాదులు వేసి చేతి పంపును కూడా ఏర్పాటు చేశారు. దీనిపై అప్పట్లో విచారణ జరిపిన రెవెన్యూ అధికారులు ఆక్రమణను నిరోధించారు. చేతి పంపును ధ్వంసం చేశారు. ఇదిలా ఉండగా అక్కడ ఇటీవల స్థల కొనుగోలుదారులు ఫెన్సింగ్ నిర్మించారు. అలాగే అక్కడ నిర్మాణాలు జరపడానికి ఉపక్రమించారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు తహసీల్దారు ఎల్.రామారావు ఆదేశాలు మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మణికంఠ, వీఆర్వో శ్రీనివాస్, వీఆర్ఏ దండి శివ తదితరులు ఆక్రమిత భూమిపై విచారణ జరిపారు. అది పేదలకు పంపిణీ చేసిన మిగులు భూమిగా గుర్తించారు. పొక్లెయిన్‌తో ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఫెన్సింగ్ పోల్స్‌ను కూలగొట్టారు. భూమిలోకి ఎవరూ ప్రవేశించకుండా రోడ్డుకు అడ్డంగా ట్రెంచ్‌ను తవ్వారు. ప్రభుత్వం భూమిని ఆక్రమించేవారు శిక్షార్హులు అంటూ బోర్డు ఏర్పాటు చేశారు. ఆ భూమి విలువ సుమారు రూ.12 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఈ విషయమై తహసీల్దారు రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటి వారిపైన అయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మరికొంత కాలం రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు మరికొంత కాలం రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

రద్దు చేసిన రైళ్లు : జనవరి 1 నుంచి 14వ వరకు గుంటూరు - విశాఖ (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు, జనవరి 2 నుంచి 15 వరకు విశాఖ-గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, జనవరి 1,2,3,5,6,8,9,10,12,13 తేదీల్లో విశాఖ-విజయవాడ- విశాఖ(22701 / 22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ ఇరువైపులా రద్దు.

రైళ్ల దారి మళ్లింపు : దిగువ రైళ్లు రెగ్యులర్ మార్గమైన విజయవాడ-ఏలూరు-నిడదవోలు మీదుగా కాకుండా మళ్లించబడిన మార్గంలో వయా విజయవాడ-గుడివాడ-భీమవరం టౌన్-నిడదవోలు మీదుగా ఆయా తేదీల్లో రాకపోకలు సాగిస్తాయి. జనవరి 1,8వ తేదీల్లో బయల్దేరే ఎర్నాకుళం-పాట్నా (22643)సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 3,5,10,12వ తేదీలలో బయల్దేరే బెంగళూరు-గౌహతి(12509) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 1,3,5,6,8,10,12,13వ తేదీల్లో బయల్దేరే ముంబయి -భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ధన్‌బాద్‌లో జనవరి 1 నుంచి 14వ తేదీల వరకు బయల్దేరే ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్, టాటానగర్‌లో జనవరి 5,12వ తేదీల్లో బయల్దేరే టాటానగర్ - ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్ , టాటానగర్‌లో జనవరి 4,11వ తేదీల్లో బయల్దేరే టాటానగర్ - యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్, హతియాలో జనవరి 2,7,9,14వ వ తేదీల్లో బయల్దేరే హతియా- ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్, జసిద్దిలో జనవరి 3,10వ తేదీల్లో బయల్దేరే జసిద్ది -తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్, హతియాలో జనవరి 1,8వ తేదీల్లో బయల్దేరే హతియా- ఎర్నాకుళం (22837) ఏసి ఎక్స్‌ప్రెస్, హతియాలో జనవరి 6,13వ తేదీల్లో బయల్దేరే హతియా- ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్‌లు ఆయా తేదీల్లో మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు అదనపు కోచ్‌లను తాత్కాలిక ప్రాతిపదికన జతచేస్తున్నట్లు త్రిపాఠి తెలిపారు. విశాఖ-గుణుపూర్-విశాఖ(08522/08521) పాసింజర్ స్పెషల్‌కు జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు థర్డ్ ఏసీ, ఒక స్లీపర్‌క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు. విశాఖ-బనారస్(18311) వీక్లీ స్పెషల్‌కు జనవరి 3 నుంచి 31 వరకు తిరుగు ప్రయాణంలో బయల్దేరే బనారస్ - విశాఖ (18312) వీక్లీ స్పెస్‌కు జనవరి 4వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను ఆయా రోజుల్లో జతచేస్తున్నారు.


ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల్లో రాయితీ అమలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: అన్ని ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల్లో 5 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి మంగళవారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రాయితీ ఎవరెవరికీ ఇచ్చారో రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని,ఈ విషయంలో అన్ని శాఖల అధికారులు పూర్తిగా సహకరించాలన్నారు. సమావేశంలో దిశ పోలీసు స్టేషన్ ఎస్ఐ రవి శంకర్, ఎన్‌జీవో ఎల్వీ రమణి, కేజీహెచ్ గైనకాలజిస్టు విభాగాధిపతి డాక్టర్ సంధ్యా దేవి, కేజీహెచ్ రేడియోలజిస్టు డాక్టర్ ఎస్.రాధ, కేజీహెచ్ పిల్లల విభాగ డాక్టర్ చక్రవర్తి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టూటౌన్ సిబ్బందికి సీపీ అభినందనలు



సీసీఎస్ సీఐ గోవిందరావు, కానిస్టేబుల్ మహ్మద్ ఇబ్రహీం, టెక్నికల్ సపోర్టర్ విష్ణువర్ధన్‌రెడ్డిని అభినందిస్తున్న సీపీ రవిశంకర్

అల్లిపురం: గంజాయి తరలిస్తున్న పెడ్లర్లను చాకచక్యంగా పట్టుకున్న టూటౌన్ సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అభినందించారు. టూటౌన్ పరిధిలోని ఓ డార్మిటరీలో సోమవారం రాత్రి బస చేసిన ముగ్గురు వ్యక్తుల వద్ద గంజాయి ఉన్నట్లు వీఎంఎస్ ద్వారా సమాచారం వచ్చింది. ఈ సమాచారాన్ని సీసీఎస్‌కు చేరవేయగా.. సీసీఎస్ కానిస్టేబుల్ తనిఖీ చేసి టూటౌన్ పోలీసులకు తెలియజేశారు. వారు అక్కడికి చేరుకుని ముగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న సీసీఎస్ సీఐ జి.గోవిందరావు, కానిస్టేబుల్ మహ్మద్ ఇబ్రహీం కల్యాల, సాంకేతికత సహకారం అందించిన కె.విష్ణువర్ధన్‌రెడ్డిలను సీపీ తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.